క్లుప్తంగా

నేడు గుడిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

దువ్వూరు : మండలంలోని గుడిపాడు గ్రామం ఎంపీపీ స్కూల్‌లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, తహసీల్దార్ రమకుమారి తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరవుతారని, కావున ప్రజాప్రతినిధులు, అధికారులు రావాలని కోరారు. వైద్య శిబిరంలో డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత


సీఎంఆర్ఎఫ్ చెక్ అందిస్తున్న తిరుపాల్‌రెడ్డి

దువ్వూరు : మండలంలోని పుల్లారెడ్డిపేటలో ఉన్న తన స్వగృహంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి ఆదివారం సంజీవరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి శివమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.5 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివమ్మ భర్త గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడని, వైద్యానికి ఎక్కువ మొత్తంలో ఖర్చయిందని తెలిపారు. వారి కుటుంబం ఇబ్బందిలో ఉండటంతో వారి పరిస్థితిని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో ఆయన ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో మాట్లాడి రూ.5 లక్షలు మంజూరు చేయించారని చెప్పారు.

విద్యార్థికి నగదు బహుమతి

పోరుమామిళ్ల : ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం తిరుపతిలో జరిగింది. ఈ సందర్భంగా పోరుమామిళ్ల విద్యార్థి బొల్లు వివేక్ రాయల్ 2022–2023లో 10వ తరగతిలో 585 మార్కులు సాధించినందుకు రూ.5000 నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రంను అందజేశారు.

ఉచితంగా గుండె వైద్య పరీక్షలు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని లక్ష్మీ కార్డియాక్, కంటి ఆసుపత్రిలో ఆదివారం గుండె, కంటి జబ్బుల బాధితులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. వివిధ రకాల గుండె సమస్యలతో వచ్చిన 47 మందికి డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన 26 మందికి ఉచితంగా ఈసీజీ, 8 మందికి గుండె స్కానింగ్ నిర్వహించారు. అలాగే డాక్టర్ సరిత 35 మందికి కంటి పరీక్షలు చేశారు.

పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్తు

పోరుమామిళ్ల : విద్యార్థులు నిత్యం పుస్తక పఠనం చేయడంవల్ల ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు ఖాశింవలి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్‌లు తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో పుస్తక పఠనం అలవర్చుకోవడం వలన సమాజం పట్ల, ప్రపంచం పట్ల, వివిధ అంశాల పట్ల అవగాహన కలుగుతుందన్నారు.

గోపు వెంకటసుబ్బారెడ్డి మానవతావాది


వెంకటసుబ్బారెడ్డి చిత్రపటానికి నివాళి దృశ్యం

ప్రొద్దుటూరు : రెడ్ల కల్యాణ మండపం నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించిన గోపు వెంకటసుబ్బారెడ్డి గొప్ప మానవతావాది అని, ఎంతో మందికి సహాయ సహకారాలు అందించారని రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి తెలిపారు. స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని రెడ్ల కల్యాణ మండపంలో ఆదివారం గోపు వెంకటసుబ్బారెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వెంకటసుబ్బారెడ్డి అందించిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో అడహక్ కమిటీ సభ్యులు నాగదస్తగిరిరెడ్డితోపాటు బి.రామిరెడ్డి, ఎస్.రాంప్రసాద్‌రెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి, శౌరి సుభాష్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, అట్లా నరసింహారెడ్డి, అన్నవరం రామ్మోహన్‌రెడ్డితోపాటు కాకర్ల నాగేశ్వారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఉండేల గురివిరెడ్డి, డాక్టర్ రాజారామ్మోహన్‌రెడ్డి, ఈటీవీ భాస్కర్‌రెడ్డి, బండి ఆత్మకూరు రామిరెడ్డి, గోపు వెంకటసుబ్బారెడ్డి సతీమణి ఆదిలక్షుమ్మ, కుమార్తె దీప తదితరులు పాల్గొన్నారు.

రేపు పెద్దగురువలూరులో ఎమ్మెల్యే పర్యటన

చాపాడు : పెద్దగురువళూరులో సోమవారం ఎమ్మెల్యే శెట్టిప్లలె రఘురామిరెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభించనున్నారు. చాపాడు సమీపంలోని వైఎస్ కల్యాణ మండపంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం జగనే ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లక్షుమయ్య తెలిపారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరుకానున్న గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు హాజరువాలని కోరారు.

శక్తిస్వరూపిణీ.. పాహిమాం


ప్రొద్దుటూరు కల్చరల్ : చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదిలక్ష్మి


మైదుకూరు: అమ్మవారిశాలలో శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారం


బద్వేలు : అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరిదేవి అలంకారం


బద్వేలు : వీరభద్రస్వామి ఆలయంలో లక్ష్మిదేవి అలంకారం


బద్వేలు : కోదండ రామాలయంలో మత్స్యావతారం


ప్రొద్దుటూరులో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


ప్రొద్దుటూరు కల్చరల్ : గౌరమ్మ తల్లి ఆలయంలో బాలాత్రిపురసందరిదేవి


ప్రొద్దుటూరు కల్చరల్ : శివాలయంలో రాజరాజేశ్వరిదేవి అలంకారం


కలసపాడు : బాలత్రిపురసుందరిదేవి అలంకారం అమ్మవారు


బద్వేలు : వెండి కలశాలతో అమ్మవారిని అభిషేకించేందుకు వస్తున్న మహిళలు

దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా పలు ఆలయాల్లో భక్తులకు అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. తొలి రోజు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో బారులు తీరారు. అన్నిచోట్ల ఆలయ నిర్వాహకులు భక్తులకు అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తు కూడా నిర్వహించారు.
- సాక్షి నెట్‌వర్క్


బ్రహ్మంగారిమఠం : శ్రీఈశ్వరీదేవిమఠంలో కలశోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


బ్రహ్మంగారిమఠం : అమ్మవారిశాల నుంచి కలశోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు


బ్రహ్మంగారిమఠం : శ్రీవీరబ్రహ్మేంద్రస్వామిమఠం ప్రాంగణంలో కలశోత్సవం

దసరాకు పటిష్ట పోలీసు భద్రత

- ఆలయాల వద్ద అప్రమత్తంగా ఉండాలి
- పోలీసు సిబ్బంది, అధికారులతో ఏఎస్పీ ప్రేరణాకుమార్


సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : దేవీనవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో పటిష్టమైన పోలీసు భద్రతను ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ ప్రేరణకుమార్ తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో దసరా ఉత్సవాల విధుల్లో పాల్గొననున్న పోలీసు సిబ్బదితో ఏఎస్పీ సమావేశం నిర్వహించారు. ఆదివారం నుంచి 23వ తేది వరకు నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగనున్నాయన్నారు. ఉత్సవాలు విజయవంతం కావడంలో పోలీసుల పాత్ర ఎక్కువ ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన ఆలయాలు, పాయింట్ల వద్ద అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. ప్రొద్దుటూరులోని ప్రతి కూడలిలోనూ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామన్నారు. దర్శనానికి వచ్చే భక్తులు క్యూ పాటించేలా కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

ఇతర ప్రాంతాల పోలీసుల సేవలు

నవరాత్రి ఉత్సవాల బందోబస్తు కోసం ప్రొద్దుటూరు సబ్‌డివిజన్‌లోని పోలీసు సిబ్బందితో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల పోలీసుల సేవలను వినియోగించుకున్నట్లు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. ఐదుగురు సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, 63 మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 233 మంది కానిస్టేబుళ్లు, 92 మంది హోంగార్డులు, 25 మంది మహిళా కానిస్టేబుళ్లు, 6 సెక్షన్ల సాయుధ బలగాలు, 100 మంది ఎన్‌సీసీ క్యాడేట్ల సేవలను నవరాత్రి బందోబస్తులో వినియోగించుకుంటున్నామని ఏఎస్పీ తెలిపారు.

దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దసరా ఉత్సవాల్లో దొంగల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ తెలిపారు. జేబు దొంగలు, చిల్లర దొంగలు జనాల్లో కలిసిపోయి సంచరించే అవకాశం ఉందన్నారు. దొంగల పట్ల పోలీసు అధికారులతో పాటు ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దర్శనానికి వెళ్లేటప్పుడు బంగారు నగలు ధరించి వచ్చే మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లవద్దని, ఎవరో ఒకరు ఇంట్లో ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో సీఐలు రాజారెడ్డి, ఇబ్రహీం, నారాయణ యాదవ్, యుగంధర్, రమణారెడ్డి, ఎస్‌ఐలు అమర్‌నాథరెడ్డి, మంజునాథ్, రెడ్డిసురేష్, భాస్కర్, రుషికేశ్వర్‌రెడ్డి, పుల్లన్న, చిరంజీవి, శివప్రసాద్, రాజగోపాల్, హైమావతి, కృష్ణంరాజునాయక్ పాల్గొన్నారు.

టీడీపీ నేత అనుచరుడికి సాయం


బాధితులకు రూ.10లక్షల ఎల్‌ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : టీడీపీ నాయకుడైన ముక్తియార్ అనుచరుడు షేక్ సలీం బాషాకు మానవతా హృదయంతో తన వంతు సాయం చేసినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. తన స్వగృహంలో ఎమ్మెల్యే ఆదివారం సలీం బాషాకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.10లక్షల ఎల్‌ఓసీ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 13వ వార్డుకు చెందిన సలీం బాషాకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి రావడంతో ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజాను సంప్రదించారన్నారు. ఖాజా సమస్యను తన దృష్టికి తేవడంతో పార్టీలకు సంబంధం లేకుండా తాను మానవతా హృదయంతో స్పందించి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి డబ్బు మంజూరు చేయించానన్నారు. వెంటనే స్పందించి తనకు సహాయం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి ఈ సందర్భంగా సలీం బాషా కృతజ్ఞతలు తెలిపాడు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాచమల్లు దంపతులు

పట్టణ ఆర్యవైశ్యసభ ఆహ్వానం మేరకు దసరా ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి, కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి ఆదివారం స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణ ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావుతోపాటు కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులకు తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొద్దుటూరు దసరా ఉత్సవాలకు ఘన చరిత్ర ఉందని తెలిపారు. అమ్మవారిశాలతోపాటు పట్టణంలోని పలు ఆలయాల్లో ఈ ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ కాకర్ల నాగేశ్వారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఏడాది ఉచితంగా ఎగ్జిబిషన్ ప్రవేశం

ప్రొద్దుటూరు : తాము అధికారంలో ఉన్నంత వరకు ప్రతి ఏడాది ఉచితంగా ఎగ్జిబిషన్ ప్రవేశాన్ని కల్పిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఎగ్జిబిషన్ మైదానంలో దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ట్రేడ్ ఫేర్ ఎగ్జిబిషన్‌ను ఆదివారం సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవితో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు టికెట్ ఉండకూడదనే నిర్ణయాన్ని తీసుకున్నామని, ఎగ్జిబిషన్‌లో ఉచిత ప్రవేశం కల్పించామన్నారు. గాంధీ పార్కులో కూడా ఎంట్రన్స్ ఫీజు లేదన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజా, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎగ్జిబిషన్ నిర్వాహకులు కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, పాతకోట బలరామిరెడ్డి, సిద్దా రమణారెడ్డి, మోడెం సందీప్, ఆయిల్ కబీర్, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ 1993 బ్యాచ్ విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ 1993వ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వవిద్యార్థులు కళాశాలను సందర్శించి పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. తమ కళాశాలలో జరిగిన నాటి జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకున్నారు. అనంతరం శిల్పకళా గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కాలేజీ స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధు, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్ రావు, వరదకుమార్, గురుశేఖర్, బాల శివారెడ్డి, వెల్లాల భాస్కర్, చంద్రశేఖర్, దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పీఆర్సీ అమలులో జాప్యం నివారించాలి


మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఈ సంవత్సరం జూలై నుంచి నూతన పీఆర్సీ అమలు చేయాలని, అయితే తీవ్ర జాప్యం వలన ఉద్యోగులు నష్టపోతున్నారని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ ఇస్తామని మాట ఇచ్చి జీపీఎస్ అమలు చేయడం దారుణమన్నారు. సీపీఎస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎస్సార్ వెంకట జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఆర్ కమిటీకి కార్యాలయాన్ని, సిబ్బందిని కేటాయించాలన్నారు. గత పీఆర్సీ అమలును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మంచి ఫిట్‌మెంట్ ఇచ్చే ఏర్పాటు చేయాలని ఎస్ఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్‌కొండయ్య కోరారు. ఈ సమావేశంలో రిజ్వాన్ ఆలీ, వెంకట రమణయ్య, పుల్లయ్య, పోలు నాగేంద్ర రెడ్డి, గంగాధర్, గండికోట బాబా, విశ్రాంత పీడీ కోటా ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాల పునఃపంపిణీ వ్యతిరేకించండి

పోరుమామిళ్ల : కృష్ణాజలాల పునఃపంపిణీ వ్యతిరేకిస్తూ ఈనెల 18న కడప వైఎస్సార్ ఆడిటోరియంలో జరిగే రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పోరుమామిళ్లలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్ల వారు విడుదల చేసి మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్ సీపీఐ, రైతుసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లు నిర్ణయం మహిళలకు వరం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

ప్రొద్దుటూరు : జూద రహిత ప్రొద్దుటూరుగా చేయాలని సంకల్పించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నిర్ణయం మహిళలకు గొప్ప వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద తెలిపారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధి అయిన రాచమల్లు జూద రహిత ప్రొద్దుటూరు కోసం స్వయంగా ఎస్పీని కలవడం గొప్ప విషయమని తెలిపారు. ఇందుకు ఎస్పీ కూడా పూర్తి సానుకూలంగా స్పందించారన్నారు. చాలా ఏళ్లుగా మట్కా, జూదం, బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యక్రమాలు ప్రొద్దుటూరులో ఉన్నాయని, గత ప్రభుత్వాలు, పాలకులు ఇంత వరకు పట్టించుకోలేదన్నారు. దూర దృష్టితో ఎమ్మెల్యే గొప్ప నిర్ణయం తీసుకోవడాన్ని మహిళా లోకం తరఫున అభినందిస్తున్నామన్నారు. మహిళలు ఎవరికైనా సమస్యలుంటే నేరుగా తమ పార్టీ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని, ఎమ్మెల్యే ద్వారా వాటిని పరిష్కరిస్తామన్నారు. అవసరమైతే మహిళలకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తన వంతు సహాయం అందిస్తారని తెలిపారు. పార్టీలకతీతంగా మహిళల రక్షణ కోసం ఎమ్మెల్యే ఆదేశాలను పోలీసులు కఠినంగా అమలు చేయాలని కోరారు. ఒక సోదరుడిలా, తండ్రిలా మహిళలకు ఎమ్మెల్యే అండగా నిలుస్తారని తెలిపారు.

మొహిద్దీన్‌ఖాన్‌కు వెంపటి చినసత్యం స్మారక పురస్కారం


మంత్రుల నుంచి పురస్కారం అందుకుంటున్న మొహిద్దీన్‌ఖాన్

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన నటరాజ కళాక్షేత్రం నాట్యగురువు పి.మొహిద్దీన్‌ఖాన్‌కు వెంపటి చినసత్యం స్మారక పురస్కారం లభించింది. కృష్ణాజిల్లా కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాక్షేత్రంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ కృష్ణాజిల్లా యంత్రాంగం, సేవ్ కూచిపూడి ఆర్ట్ అకాడమి చెన్నై, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జయహో భారతీయం ఆధ్వర్యంలో పద్మభూషణ్ అవార్డు గ్రహీత వెంపటి చినసత్యం జయంతి వేడుకలు జరిగాయి. ఈ వేడుకలో మొహిద్దీన్ ఖాన్ కూచిపూడి నాట్యానికి చేసిన సేవలకు, అభివృద్ధికి పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి ఆర్కే రోజా, గృహ నిర్మాణ శాఖామంత్రి జోగిరమేష్, ఎమ్మెల్యే అనిల్ కుమార్, పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు.